హైదరాబాద్ వార్త



రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడానికి ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి శివధర్ రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్





# జూబ్లీహిల్స్‌లో నవీన అధ్యాయం

**-నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ**

**- లక్ష ఓట్లకు చేరువలో నవీన్‌యాదవ్**

**-పదేళ్ల తరువాత జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్ జెండా**

**- గెలుపుతో సరికొత్త ప్రస్థానం**



గెలుపు సంబరాల్లో నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభావవార్తః**

**జూబ్లీహిల్స్ చరిత్రలో నవీన అధ్యాయం ప్రారంభమైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో విజయాన్ని సాధించారు. దాదాపు లక్ష ఓట్లను తనవైపు కు మరల్చుకోవడమే కాకుండా ప్రత్యర్థిపై పాతిక వేల మెజార్టీని సాధించి నియోజకవర్గ చరిత్ర లోనే అత్యధిక మెజార్టీ సాధించిన అభ్యర్థిగా రికార్డుల కెక్కాడు. తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని నమోదు చేశాడు. దాదాపు పదేళ్ల తరువాత జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.**

**మెజార్టీ రికార్డు బ్రేక్..**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ పేరిట ఉంది. 2009లో దాదాపు 21,741 ఓట్ల మెజార్టీ సాధించారు. అనంతరం మాగంటి గోపీనాథ్ 2014లో తెదేపా అభ్యర్థిగా 9,242 ఓట్ల మెజార్టీ, భారాస నుంచి 2018లో 16,004 ఓట్ల మెజార్టీ, 2023లో అజారుద్దీన్‌పై 16,337 ఓట్ల మెజార్టీని సాధించారు. కాగా నవీన్ యాదవ్ ఉప ఎన్నికల్లో 24, 658 ఓట్ల మెజార్టీ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉప ఎన్నికల ఫలితాలలోనూ ప్రతి రౌండ్‌లోనూ ఆయన స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా నవీన్‌యాదవ్ ప్రతి రౌండ్‌లో తన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. మొదటి రౌండ్‌లో 47 ఓట్లు, రెండో రౌండ్‌లో 2948, మూడో రౌండ్‌లో 2,999 ఓట్లు, నాల్గో రౌండ్‌లో నవీన్‌యాదవ్‌కు 3547 ఓట్లు, 5వ రౌండ్‌లో 3300 ఓట్ల మెజార్టీ, 6వ రౌండ్‌లో 2938 ఓట్ల మెజార్టీ, 7వ రౌండ్‌లో 4000 ఓట్లు, 8వ రౌండ్‌లో 1875 ఓట్ల మెజార్టీ, 9వ రౌండ్‌లో 2249 ఓట్ల మెజార్టీ, 10వ రౌండ్లో 808 ఓట్ల మెజార్టీ సాధించారు.

## ఓటములనే మెట్లుగా చేసుకొని..

నవీన్‌యాదవ్ రాజకీయ ప్రస్థానం ఒడిదుడుకులతో ముందుకు సాగింది. దాదాపు 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో కార్పొరేటర్ అభ్యర్థిగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటములనే చవిచూశారు. 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి తేదేపా అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2014లో ఎంఐఎం తరుపున జూబ్లీహిల్స్ నుంచి బరిలో నిలిచి 41,656 ఓట్లను సాధించారు. దాదాపు 25.19 శాతం ఓట్లను సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహమత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ సారి ఘనమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు.

## మాగంటి కుటుంబ గెలుపునకు బ్రేక్..

మాగంటి గోపీనాథ్ 2014 ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగుపెట్టారు. టీడీపీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 2014లో టీడీపీ తరుపున ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ నుంచి 2018, 2023లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి విజయాన్ని సొంతం చేసుకొని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరు సాధించారు. అనారోగ్య కారణాల రిత్య మాగంటి గోపీనాథ్ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతగోపీనాథ్‌కు బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. మాగంటికి ఉన్న పేరుతో ఉప ఎన్నికల్లో మరోసారి విజయాన్ని సొంతం చేసుకొందామని భావించినప్పటికి వారి విజయానికి నవీన్‌యాదవ్ బ్రేక్ వేశారు.

### డివిజన్ల వారీగా వచ్చిన ఓట్లు, పోలింగ్ శాతాన్ని గమనిస్తే ఇలా ఉంది..

| డివిజన్ | కాంగ్రెస్ | శాతం | బీఆర్ఎస్ | శాతం | బీజేపీ | శాతం | ఇతరులు | శాతం | మొత్తం ఓట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| షేక్‌పేట | 15,018 | 8 | 13,078 | 42 | 2373 | 8 | 713 | 2 | 31182 |
| ఎర్రగడ్డ | 14,158 | 48 | 11,939 | 40 | 2938 | 10 | 681 | 2 | 29,716 |
| వెంగళ్‌రావునగర్ | 13,348 | 52 | 8,992 | 35 | 2733 | 11 | 590 | 2 | 25,663 |
| రహమత్‌నగర్ | 20,728 | 53 | 15,033 | 38 | 2459 | 6 | 895 | 2 | 39,115 |
| సోమాజీగూడ | 7,135 | 51 | 4,408 | 32 | 2034 | 15 | 335 | 2 | 13,912 |
| యూసుఫ్‌గూడ | 13,829 | 55 | 8,537 | 34 | 2442 | 10 | 475 | 2 | 25,283 |
| బోరబండ | 14,729 | 49 | 12,247 | 41 | 2062 | 7 | 722 | 2 | 29,760 |
| | 98,945 | 51 | 74,234 | 38 | 17,041 | 9 | 4,411 | 2 | 1,94,631 |

# 40ఏళ్ల కష్టం ఫలించింది

**-సిఎం రేవంత్‌రెడ్డికి వెయ్యికోట్ల దండాలు**

**-నవీన్‌యాదవ్ తల్లి కస్తూరి భావోద్వేగం**



**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుతో ఆ పార్టీ శ్రేణులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో పనిచేసిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సైతం హ్యాపీగా ఉన్నారు. తాజాగా నవీన్ యాదవ్ గెలుపుపై.. ఆయన తల్లి కస్తూరి స్పందించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "నా కొడుకు గెలవడం చాలా ఆనందంగా ఉంది.. సీఎం రేవంత్ రెడ్డికి వెయ్యి కోట్ల దండాలు.. 40 ఏళ్ల కష్టం ఫలించింది.. నా బిడ్డను తొక్కే ప్రయత్నం చేశారు.. కానీ భగవంతుడి దయ వల్ల నా కొడుకు గెలిచాడు" అని నవీన్ యాదవ్ తల్లి కస్తూరి చెప్పుకొచ్చారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై నవీన్ యాదవ్ గెలుపొందారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం.

# నవీన్‌కు కలిసొచ్చిన నవంబరు

**- జన్మదినానికి ముందే కానుక**



తన తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులతో నవీన్‌యాదవ్.

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభావవార్తః**

కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన నవీన్‌యాదవ్‌కు నవంబరు మాసం ఎంతో ప్రత్యేకం. నవంబరు 17న జన్మించిన ఆయన 2023 నవంబరు 13న కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీచేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మరో మూడు రోజుల్లో జన్మదినం ఉండటంతో ఈ నవంబరు మాసం ఆయనకు ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా నవీన్‌యాదవ్ విజయంపై తల్లిదండ్రులైన చిన్న శ్రీశైలం యాదవ్, కస్తూరి మాట్లాడుతూ.. 40 ఏళ్ల తమ కళ ఫలించిందన్నారు. నవీన్ విజయంతో వారు ఆనందభాష్పాలు రాల్చారు. ఈ విజయం నియోజకవర్గ కుటుంబ సభ్యులకు అంకితమని నవీన్‌యాదవ్ భార్య వర్షయాదవ్ స్పష్టం చేశారు.

## కార్తీక మహోత్సవంలో శ్రీసంగమేశ్వరస్వామికి లక్షబిల్వార్చన



భక్తులకు విశేష దర్శనమిస్తున్న శ్రీ సంగమేశ్వరస్వామి

**నాంపల్లి, నవంబరు 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలోని ఎస్‌బిహెచ్ కాలనీ గాంధీనగర్‌లో ఉన్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాస మహోత్సవాల్లో ప్రత్యేక పూజల్లో నేడు 15 శనివారం లక్ష బిల్వార్చన, రేపు 16 ఆదివారం అన్నాభిషేకము పెద్దయెత్తున జరుపుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ప్రధాన అర్చకుడు ఎం.చంద్రశేఖరశర్మ (శ్రీనివాస్) తెలిపారు. గత నెల 22 నుండి ఈ నెల 20వరకు శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో జరుపుతున్న కార్తీకమాస మహోత్సవం శాస్త్రీయ సంప్రదాయబద్ధంగా అర్చక స్వాముల చే భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న విషయం మా పాఠకులకు విదితమే. అందులో భాగంగా కార్తీకమాస ఏకాదశి శనివారం శ్రీ సంగమేశ్వరస్వా మి వారికి సాయంత్రం 5గంటల నుండి లక్ష బిల్వా ర్చన, కార్తీక ద్వాదశి ఆదివారం ఉదయం 9 నుండి అన్నాభిషేకము కన్నులపండువగా నిర్వహి స్తున్నట్లు, అలాగే కార్తీకమాస చివరిసోమవారం తెల్లవారుజా మున 4 నుండి మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకము, ఉదయం 7.30, 9.00, 10. 30, మధ్యాహ్నం 12గంటలకు ఏకవా ర రుద్రాభిషేకములు జరుగుతాయని, పెద్దసం ఖ్యలో భక్తు లు విచ్చేసి ఆయా పూజాకార్యక్రమాల్లో పాల్గొని శ్రీసంగమేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని లక్ష్మారెడ్డి కోరారు.

## నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి కూలీ మృతి

### మరో కూలీకి తీవ్ర గాయాలు



ప్రమాదం చోటుచేసుసుకున్న నిర్మాణంలో ఉన్న భవనం

**గచ్చిబౌలి, నవంబరు 14 ప్రభాతవార్త :** కొండాపూర్‌లో ఎటువంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా, కనీస జాగ్రత్తలు పాటించకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండడంతో ప్రమాదవశాత్తు కూలీలు జారి పడగా, ఓ కూలీ మ ృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో గల జెమ్ సర్వీస్ సెంటర్ వెనుక వైపు ఓ భవన నిర్మాణం కొనసాతుంది. ఐదంతస్థుల ఈ భవనం కనీస సెట్‌బ్యాక్‌లు లేకుండా, కనీస జాగ్రత్తలు పాటించకుండా వేగంగా పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన చంద్రకుమార్(33), జమ్మన సోన్‌వానీ విక్కీ(23)లు నగరానికి వచ్చి ఈ భవనంలో కూలీలుగా పనిచేస్తున్నారు. కాగా శుక్రవారం భవనం 4వ అంతస్థులో పనులు చేస్తుండగా, గోవా కర్రల మీద నుంచి ప్రమాదవశాత్తు చంద్రకుమార్, విక్కీలు భవనం కింద పడ్డారు. దీంతో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని వెంటనే కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రకుమార్ కొద్దిపేపట్లోనే మ ృతి చెందగా,మరో కూలీ విక్కీ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకొని విచారణ చేప ట్టారు.చనిపోయిన చంద్రకుమార్ మ ృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసు పత్రికి తర లించారు.కాగా కనీస జాగ్రత్తలు పాటిం చకుండా పనులు చేపట్టిన కారణంగానే ప్రమా దం చోటుచేసు కుందని తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు కాంట్రాక్టర్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# గ్రేటర్‌లో పట్టుబిగిస్తున్న కాంగ్రెస్

**-మొన్న కంటోన్మెట్ ..నేడు జూబ్లీహిల్స్**

**-ఉప ఎన్నికల్లో వరసగా రెండోసారి గెలుపు**

**హైదరాబాద్,నవంబరు 14,ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ ఘనవిజయం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దీంతో గ్రేటర్‌లో వరుసగా జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌లో పట్టుసాధిస్తోంది. సాధారణ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో పేలవ ప్రదర్శన మూలంగానే అటు తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నాలుగు ఎంపీల్లో ఒక్కటీ దక్కించుకోలేక పోయింది. ఇప్పుడా లోటును భర్తీ చేస్తూ వచ్చే ఏడాది జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు బాటలు వేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఊహించిన స్థాయిలో ఆధిక్యం లభించడం పార్టీలోనూ చర్చనీయాంశమైంది. ఈ ఘనవిజయం వెనక సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మక ప్రణాళిక ఎంతో పనిచేసింది. ఆయన ఎత్తుగడలతోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినట్లు తెలుపుతున్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో క్యాడర్ లేదన్న వాస్తవాన్ని రేవంత్ రెడ్డి ముందే గ్రహించారు. అందుకు అనుగుణంగానే పావులు కదిపారు. గతంలో పోటీ చేసిన అజారుద్దీన్‌ను పోటీకి నిలిపితే చెమటోడ్చాలన్న అంచనా వచ్చారు. అజారుద్దీన్ ను బరిలోకి దింపితే మైనార్టీ ఓట్లు వచ్చినా బీజేపీ చీలిక తెస్తే ఇబ్బంది అవుతోందని తదనుగుణంగానే అధిష్ఠానాన్ని ఒప్పించి ఆయన్ను ఎమ్మెల్సీగా నియమిస్తూ క్యాబినెట్ తీర్మానం చేశారు. కానీ గవర్నర్ ఆమోదం లభించకపోవటంతో మైనార్టీల్లో అసంతృప్తిని గ్రహించిన రేవంత్‌రెడ్డి పోలింగ్‌కు కొద్ది రోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు.



**వ్యూహాత్మకంగా అభ్యర్థి ఎంపిక..**

అటు పార్టీ అభ్యర్థిగా యువకుడు, స్థానికంగా అంగ, అర్థబలం పుష్కలంగా ఉన్న నవీన్ యాదవ్‌ను ప్రకటించేలా అధిష్ఠానాన్ని ఒప్పించి మెప్పించారు. మైనార్టీ ఓట్ల ప్రాధాన్యత, ఎంఐఎంకున్న పట్టును దృష్టిలో ఉంచుకుని నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభ్యర్థిగా ప్రకటించారు. నవీన్ యాదవ్ రాజకీయ జీవితం ఎంఐఎంలోనే ప్రారంభమైంది. ఇలా అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తపడిన ప్రచారంలోనూ తనదైన శైలి ప్రదర్శించి.వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టడంలో విజయం సాధించారు. ముఖ్యంగా ఇక పార్టీ ప్రచార బాధ్యతలను డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి ఆయనే దగ్గరుండి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా కార్నర్ మీటింగ్స్ ఏర్పాటు చేసి రెండేళ్ల పాలనతో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు, బీఆర్ఎస్ చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టారు. బీఆర్ఎస్, బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా స్పందిచవద్దని పార్టీ నేతలకు స్పష్టమైన సూచనలు చేశారు. ఇలా రేవంత్ ప్రదర్శించిన వ్యూహాత్మక వైఖరితో బిఆర్ఎస్ -బిజెపి అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. జూబ్లీహిల్స్ చరిత్రలోనే గతంలో ఏ అభ్యర్థికి ఇంత భారీ మెజార్టీ రాకపోగా అటు బీజేపీకి డిపాజిట్ గల్లంతైంది.

**అర్బన్‌లోనూ కాంగ్రెస్ హవా..**

ఇంతకాలం బిఆర్ఎస్ కు అర్బన్ ప్రాంతాల్లో మంచి పట్టు ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇది నిరూపితమయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోనే కాంగ్రెస్ కు అత్యధిక ఓట్లు సీట్లు వచ్చాయి. కానీ పట్టణాలు, నగరాల్లో ఆ పార్టీ చతికిలపడింది. హైదరాబాద్ లో అయితే కనీసం ఒక్కసీటుకూడా సాధించలేకపోయింది. ఇదే సమయంలో బిఆర్ఎస్ అర్బన్ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దీంతో కాంగ్రెస్ అంటే గ్రామీణ పార్టీ, బిఆంఎస్ అంటే అర్బన్ పార్టీ అనే అభిప్రాయం ఏర్పడింది. మొన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఇప్పుడు జూబ్లీహిల్స్ లో విజయం సాధించింది కాంగ్రెస్... తద్వారా ఈ అభిప్రాయాన్ని మార్చేందుకు అవకాశం దక్కింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయం రాబోయే జిహెచ్ ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఎంతగానో ఉపయోగపడనుంది. అర్బన్ ఓటర్లు కూడా తమపై నమ్మకంతో ఉన్నారనే మెసేజ్ ను పార్టీ శ్రేణుల్లోకి తీసుకెళ్లి మరింత ఉత్సాహంగా పనిచేసేలా ప్రోత్సహిస్తుంది. హైదరాబాద్ లో కాంగ్రెస్ న మరింత బలంగా నిర్మించేందుకు ఈ జూబ్లీహిల్స్ గెలుపు పునాదిగా మారనుంది. అంతేకాదు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కు కలివస్తుంది.

## అబద్ధాల బిఆర్ఎస్, మతోన్మాద బిజెపిని ఓడించిన జూబ్లీహిల్స్ ప్రజలకు అభినందనలు


సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మా

**సైఫాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** అబద్దాల బిఆర్ఎస్, మతోన్మాద బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టిన జూబ్లీహిల్స్ ప్రజలకు, అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా అభినందనలు తెలిపారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ ఈ ఎన్నికల్లో అహంకార పూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా పచ్చి అబద్దాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రయత్నం చేశారని ఆరోపించారు. బిజెపి అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడకుండా మతోన్మాద రాజకీయాలను ప్రేరేపించి ఓట్లు రాబట్టుకోవడానికి అనేక కుట్రలకు పాల్పడిందని, వీటిని పక్కనబెట్టి వారికి గుణపాఠం చెప్పేవిధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు ఓట్లు వేసి పట్టం గట్టారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు స్టాలిన్, ఎం.నర్సింహ్మా, మహ్మద్ సలీం, బి.వెంకటేశం, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు

### సిఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కూన శ్రీశైలం గౌడ్


రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీశైలంగౌడ్

**జీడిమెట్ల, నవంబర్ 14, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ఘనవిజయం సాధించిన సందర్భంగా సీఎం నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు.

### నల్లకుంటలో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు


నల్లకుంటలో మిఠాయి పంచుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్ హరినాథ్ రెడ్డి, దేవిరెడ్డి విచిత్ర రెడ్డి, మురళీకృష్ణ తదితరులు

**హైదరాబాద్ నవంబర్ 14 ప్రభాతవార్త ;**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన విజయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. హరినాథ్ రెడ్డి అభివర్ణించారు.ఈ మేరకు శుక్రవారం నల్లకుంట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా నల్లకుంట కూరగాయల మార్కెట్ రోడ్డులో మిఠాయి పంచిపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ లో నినాదాలతో దద్దరిల్లింది. ఈ సందర్భంగా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలు రేవంత్ రెడ్డి పాలనను ఆశీర్వదించి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. వచ్చే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, మహిళా నాయకురాలు దేవిరెడ్డి విచితారెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు రామ్మోహన్‌రావు,సిహెచ్ మురళీకృష్ణ, శరత్, మధుసూదన్ రెడ్డి, కాలేరు శ్రీనివాస్, కె.మురళీకృష్ణ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## వీరికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలుసా...!
### - నోటాకు అత్యధికంగానే ఓట్లు

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభావవార్త:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఈ సారి అత్యధికంగా దాదాపు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రిజిస్టర్ పార్టీలలో అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థి ఆంబోజు బుద్దయ్యకు 232 ఓట్లు, తెలంగాన సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్యకు 182 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బోగం చీరంజీవికి 181 ఓట్లు, అఖిల్ భారతీయ ముస్లీం లీగ్(సెక్యులర్) అబ్దుల్ సత్తార్ ముజాహిద్‌కు 177 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి బెర్ర బాలకిషన్‌కు 175, ఆనంద్‌రావు జొల్లుకు 145 ఓట్లు వచ్చాయి. మార్వాడీ గో బ్యాక్ నినాదంతో పేరుగాంచి విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ నుంచి పోటీ చేసిన పగిడిపల్లి శ్యాంసన్‌కు 143 ఓట్లు, యుగతులసి పార్టీ అభ్యర్థి శివకుమార్‌కు 70 ఓట్లు పోలయ్యాయి. నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగి గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందిన మహ్మద్ అన్వర్‌కు 24 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో అతి తక్కువగా స్వతంత్ర అభ్యర్థి రాథోడ్ రవీందర్‌నాయక్‌కు 9 ఓట్లు వచ్చాయి.

## నగర కేంద్రం గ్రంథాలయంలో ప్రారంభమైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ

**చిక్కడపల్లి నవంబర్ 14 ప్రభాతవార్త :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ జ్యోతిని వెలిగించి సరస్వతి దేవి చిత్ర పటానికి, ఎస్ఆర్ రంగనాథన్, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ ప్రథమ శ్రేణి గ్రంథపాలకురాలు ఎల్. చంద్రకళ , సంస్థ ప్రథమ శ్రేణి గ్రంథపాలకురాలు యం. సుబ్బలక్ష్మి, ద్వితీయ శ్రేణి గ్రంథపాలకురాలు బి. ప్రతిభా రెడ్డి, ఉద్యోగులు అవినాష్, వెంకటేశ్వర రెడ్డి, రామ్మోహన్, మహేందర్, అనిల్, రాజేష్ , నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, వివిధ శాఖా గ్రంథాలయ ఉద్యోగులు మరియు హైద్రాబాద్ నగర గ్రంథాలయ సంస్థ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు

## గోరక్షకులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం : మహేష్ అగర్వాల్


చింతల గోశాలకు పశుగ్రాసం పంపిణి చేస్తున్న గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్

**హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:**

గోరక్షకులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆరోపించారు. గోవులను రక్షించాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గోరక్షకులు వాటిని రక్షిస్తున్న సందర్భంలో వారిపై దాడులు పెరిగిపోతున్నాయని. ఈ విషయంలో ప్రభుత్వ స్పందన నామమాత్రంగానే ఉంటోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ ఈశ్వర్ ప్రసాద్ సంఘీ జ్ఞాపకార్థం శుక్రవారం చింతల గోశాలకు ఆయన పశుగ్రాసం పంపిణి చేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలు ఏర్పాటు చేస్తామని. గోవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానాలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు. గోశాలల ఏర్పాటు కోసం గోశాల ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వానికి భూములను ఇస్తామని, అక్కడ గోశాలలు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గోవుల రక్షణకు ఎన్ని చట్టాలున్నా వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందువల్లనే గోవులు వధశాలలకు వెళ్తున్నాయని, గో రక్షకులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. గోవుల రక్షణతో పాటు గో రక్షకులను ప్రభుత్వం అండగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా విరాజిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ యానిమల్ వెల్ఫేర్ విభాగం చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోద్ మాట్లాడుతూ గత రెండు సంత్సరాలుగా నగరంలోని వివిధ గోశాలలకు పశుగ్రాసం, దాణా, మందులను అందిస్తున్నట్లు తెలిపారు. గోమాతను కాపాడుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హరీష్ సంఘీ, మనీష్ సంఘీ, గోశాల ప్రతినిధి నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ సేవాసమితి సేవలు మరువలేనివి : కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్


బాలలదినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు నోట్‌బుక్స్,బ్యాగులు, ప్లేట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, నవంబర్ 14 ప్రభాతవార్త**

నిరుపేద,బడుగు, బలహీనవర్గాలకు చేయూతనందిస్తూ,సమాజాభ్యున్నతికి పాటుపడుతున్న మదర్‌సేవా సమితి సేవలు మరువలేనివనిశేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ సేవాసమితి సోషల్ వెల్ఫేర్,చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు నోట్‌బుక్స్,బ్యాగులు, ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..2005లో స్థాపించిన మదర్‌సేవాసమితి రెండు దశాబ్ధాలుగా వివిధ సేవలతో ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ముఖ్యంగా వరద బాధితులకు బియ్యం,బట్టలు పంపిణీ చేయటంతో పాటు వివిధ పండుగలకు వృద్దులు, వికలాంగులకు చీరలు, నగదు అందిస్తుందని అన్నారు. అదే విధంగ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ నివారణ కోసం 2016 నుంఛి మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో జూట్ బ్యాగులను తయారు చేసి స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ల చేతుల మీదుగా అందిస్తుందన్నారు. 20ఏళ్లుగా తమవంతు సమాజిక సేవా కార్యక్రమాలను చేస్తున్నామని సంస్థ ఛైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు. ఉచితంగా స్టీల్ ప్లేట్స్, ఆట వస్తువులు, స్వీట్స్, పేదలకు అన్నదాన కార్యక్రమాలతో పాటు దుప్పట్లు, జ్యూట్‌బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్నామని, ఇందులో భాగంగానే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు నోట్‌బుక్స్,బ్యాగులు,ఆట వస్తువులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కే.రమేష్,ఎస్‌పి రెడ్డి, టి.నర్సింహా,కుమార్ గుప్త, ప్రవీణ్ గుప్త, దామోదర్ గుప్త,భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాకర్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష పదవికి ఎన్నికలు

**.చిక్కడపల్లి నవంబర్ 14 (ప్రభాతవార్త );** సుందరయ్య పార్క్ లో 23 న జరిగే వాకర్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికకు ప్రతి ఒక్కరు సహకరించాలని .వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రెసిడెంట్ పాశం వెంకట నిరంజన్ రెడ్డి కోరారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా కూడా ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఎన్నికను అడ్డుకోవటానికి కుట్రలు చేస్తున్నారని, పార్కులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేక, ఎన్నికల్లో నిలబడితే ఓడిపోతామనే అభద్రతతో పార్కుపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నిబంధనలకు అనుసంధానంగానే నవంబర్ లోఎన్నికలు పూర్తి చేయాల్సి ఉన్నందున ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఎన్నికల కమిషన్ నియమించి నోటిఫికేషన్ విడుదల చేశామని చెప్పారు. 23న ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. ఓటమి భయంతోనే వాకర్స్ క్లబ్ పై దుష్ప్రచర్మం చేస్తున్నారని, పార్కుపై ఆధిపత్యం కోసం ప్రజాస్వామ్య పద్ధతినీ ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ వి నాగభూషణం, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా మాజీ ప్రెసిడెంట్ లు సంపత్ రెడ్డి, సంకా మురళీకృష్ణ, సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కళ్యాణ్ నాయక్, మాజీ ప్రెసిడెంట్లు సలిపేల రమేష్ రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, శైలజ మోహన్, సీనియర్ వాకర్ సభ్యులు మహమ్మద్ రఫీ ఖాన్ , కల్లూరి రమేష్ వీరభద్రారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లో మధుమేహంపై కెబిఆర్ వద్ద అవగాహన నడక


అవగాహన నడకలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది.

**జూబ్లీహిల్స్, నవంబరు 14, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీకే హెల్త్ హబ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం వద్ద అవగాహన నడకను నిర్వహించారు. కేబీఆర్ ఉద్యానవనం నుంచి మొదలైన నడక జీవీకే హెల్త్ హబ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీకే డయాబెటిస్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.జి. శాస్త్రి మాట్లాడుతూ.. మధుమేహం వల్ల రక్తనాళాలు ప్రభావితం అవుతున్నాయి. దానివల్ల చిన్నవయసులోనే గుండె సమస్యలు, మూత్రపిండాల సమస్యలు తలెత్తుతున్నాయి. మన దేశం మధుమేహం విషయంలో ప్రపంచ రాజధానిగా ఉంది. అందువల్ల అందరికీ ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించేందుకే డయాబెటిస్ వాక్ నిర్వహించాం అని తెలిపారు. చిన్నతనం నుంచి టైప్1 మధుమేహం ఉండి, దాన్ని అధిగమించి పెళ్లిళ్లు చేసుకన్నవారు, ఇప్పుడిప్పుడే దాని గురించి తెలిసి ఇబ్బంది పడుతున్న పిల్లలకు ఇక్కడ అవగాహన కల్పించారు. నాలుగైదేళ్ల వయసులో టైప్1 మధుమేహం ఉండి, ఏం తినాలో ఏం తినకూడదో కూడా సరిగా తెలియని పిల్లలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టైప్1 మధుమేహానికి ఉచిత చికిత్స అందించడంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శివ, కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ దీపిక, ఇంకా పెద్ద సంఖ్యలో వైద్యులు, ఆస్పత్రి సీఓఓ జె.సుమన్ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### అవకాశమున్నా గెలుపును చేజార్చుకున్న బిఆర్ఎస్

**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీకి గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ సొంత పార్టీ నేతల తప్పిదాల వల్ల ఓటమిపాలయ్యారాని చాణిక్య సర్వే ముకేష్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సానుభూతి ఉన్నపటికి వినియోగించుకోకపోవడం వల్లే ఓటమిపాలయ్యారని నవంబర్ 4న చాణిక్య ఆధ్వర్యంలో తెలిపిన ఎగ్జిట్ పోల్ సర్వే బిఆర్ఎస్ గెలుపు అవకాశాలు అని వెల్లడించిన సర్వేలో ఒక్కసారి జరిగిన మార్పులు తమ సర్వేయర్లు చేసిన సర్వేలో కొన్ని విషయాలు వెల్లడించారని వాటిని ఆధారం చేసుకుని నవంబర్ 11న తిరిగి కాంగ్రెస్ గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని తాము తెలియజేయడం జరిగిందన్నారు. దీనికి ప్రధాన కారణం 8,9,11 తేదీల్లో ప్రతిపక్ష నాయకులు ప్రజల వద్దకు వెళ్లలేక పోవడం, అధికారపక్షం నుండి మంత్రులు చైర్మన్లు వారితోపాటు ప్రతి 100 ఓటర్లకు ఒక ఇన్చార్జిని నియమించి ఓటర్లను కలిసే అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవడమే గెలుపుకు ప్రధాన కారణమైందని తెలిపారు. ఫలితాలు తారు మారు కావాడానికి ప్రతిపక్షలలో మాజీ మంత్రి హరీష్ రావు కొంత విరామం తీసుకోవడం కేటీఆర్ ఒంటరి పోరాటం చేయడం కెసిఆర్ అసలు ఈ ఉప ఎన్నికలలో అభ్యర్థి గెలుపు కోసం ప్రచార బాధ్యతలు చేపట్టకపోవడం వలన ప్రజలు నిరాశ చెంది గత్యంతరం లేక కాంగ్రెస్ ను గెలిపించారనే చాణక్య సర్వే ఆధారంగా సుమారు 16 వేల ఓట్ల మెజారిటీ కాస్తా?24 వేలకు చేరడం పట్ల కాంగ్రెస్ పార్టీ పోల్ మేనేజ్మెంట్ తీవ్రమైన కృషి చేసిందని తెలిపారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



**అత్తాపూర్ నవంబరు 14, ప్రభాతవార్త :**

బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జడ్పిహెచ్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులగా మారి విద్యార్థులకు బోధన చేశారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భూక్య శ్రీను నాయక్,అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి,రాజమహేందర్ రెడ్డి,పరమేష్, సుధాకర్,రూపదేవి,నరసింహ చారి,గాంగ్య నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అత్తాపూర్ నవంబరు 14, ప్రభాతవార్త :** గుర్తుతెలియన వాహన ఢికొన్ని ఓ బిచ్చగాడు మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం...అత్తాపూర్‌లోని పిల్లర్ 118వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి(బిచ్చాగాడు) రోడ్డు దాడుతుండగా లాంగర్ హౌస్ నుండి అత్తాపూర్ వైపు వస్తున్న టిఎస్ 12ఈపి0395 మోటర్ సైకిల్ వాహనదారుడు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఢికొట్టడంతో తీవ్ర గాయాలైయి.అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు పోలీసులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన వ్యక్తిని పిఎంఇ కోసం ఓజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## గంజాయికి వ్యతిరేకంగా విజయవంతంగా మానవహారం


మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, నవంబర్ 14, ప్రభాతవార్త**

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం జగద్గిరిగుట్ట బస్టాప్ లో అఖిలపక్ష పార్టీల నాయకులు, బస్తీ కమిటీల నాయకులు విద్యార్థుల ఆధ్వర్యంలో మానవహారాన్ని నిర్మించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ నవీన్ రెడ్డి హాజరై ప్రజల సహకారంతో జగద్గిరిగుట్టలో గంజాయిని నిర్మూలించడానికి పనిచేస్తామని, గంజాయి ఆరోగ్యాన్ని పాడు చేయడమే కాకుండా సమాజంలో అశాంతిని సృష్టిస్తుందని అన్నారు. గంజాయికి ఎక్కువగా విద్యార్థులు, యువకులు అలవాటు పడుతున్నారని దానికి ముఖ్య కారణం ఒత్తిడి, పని భారం, తల్లిదండ్రులు వారిని సరిగ్గా పట్టించుకోకపోవడం, చదువు లేకపోవడం వంటి కారణాలేనని అన్నారు. గంజాయికి అలవాటుపడకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడిని తట్టుకోగలుగుతారని, గంజాయికి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను ఇంకా చైతన్యవంతం చేసి జగద్గిరిగుట్టలో గంజాయి లేకుండా చేయాలని, జగద్గిరిగుట్టలో ఇలాంటి కార్యక్రమాన్ని ప్రజలు అఖిలపక్ష పార్టీల నాయకులు కలిసి స్వచ్ఛందంగా చేయడం ఒక మంచి ముందడుగు అని అన్నారు. రానున్న రోజుల్లో కూడా గంజాయికి వ్యతిరేకంగా అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు ప్రజానాట్య మండల అధ్యక్షుడు ప్రవీణ్, కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్, సాయి పంతుల, జనసేన అధ్యక్షుడు సతీష్, టిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్, సోషల్ వర్కర్ చికిలే మధుబాబు, హెల్పింగ్ హార్ట్స్ విజయ్, ప్రజానాట్యమండలి బాబు, వివిధ బస్తీల నాయకులు సదానందం, ఖయ్యాం, సాయిలు, రవీందర్ రెడ్డి బ్రహ్మానందచారి, వెంకటేష్, కుమారస్వామి, అరుణ్, పవన్ రెడ్డి, ప్రవీణ్, జార్జ్, క్యాబ్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, శ్రీనివాస్ ఎం సిపిఐ నాయకులు రవీందర్ గౌడ్ మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, త్రివేణి, సరిత, ఇంద్ర, జయ, యువజన నాయకులు కీర్తి, వంశీ, జంబు శ్రీనివాస్, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని మానవహారం కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పుస్తకం హస్త భూషణం: సినీ దర్శకులు డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ


గ్రంథాలను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 14, ప్రభాతవార్త :**

పుస్తకం హస్త భూషణం లాంటిదని సినీ నిర్మాత, దర్శకులు డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కుసుమ ధర్మన్న కళాపీఠం మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభ నందు రచయితలు చుంచు సంతోష్ కుమార్ రచించిన ఆకాశంలో బ్రహ్మ... భూలోకంలో అమ్మ, రాజ్యలక్ష్మి శశిధర్ రచించిన విజయ మల్లిక, నారి నరేష్ రచించిన నా ప్రయాణం, పడిగెల దేవిదాస్ రచించిన ఆచార్య అక్షరమాల పుస్తకావిష్కరణలు ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వాలనతో ప్రారంభించిన కార్యక్రమంలో కవులు, కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధ కుసుమ మాట్లాడుతూ కవులు సామాజిక హితం కోసం రచనలు చేస్తూ ఉంటారు. అటువంటి కవులు ఒకేసారి నాలుగు పుస్తకాలు ఆవిష్కరించడం చాలా సంతోషమని తెలిపారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ ఒక పాత చొక్కా అయినా తొడుక్కో కానీ కొత్త పుస్తకం మాత్రం కొనుక్కొని చదువుకో. నేటి తరం పుస్తకం యొక్క విలువను తెలుసుకోవాని కోరారు. ఈకార్యక్రమంలో సమాజ సేవకులు డాక్టర్ ఆమంచ అంజయ్య, డాక్టర్ మహ్మద్ షా, రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, నవంబర్ 14, ప్రభాతవార్త**

నేడు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 02:00 వరకు 11 కెవి నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్జి, మా విల్లాలు, వెంకట్ ప్రణీత్, తరణ్ భస్వానీ ఫీడర్లలోని ఇందిరా నగర్, కాకతీయ నగర్, బాచుపల్లి జిపి, షికారా విల్లాలు, ఎస్సి కాలనీ, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా, సాయి నగర్ కాలనీ, ఆదిత్య గార్డెన్స్, ప్రణీత్ అపార్ట్‌మెంట్లు, తరణ్ భస్వానీ అపార్ట్‌మెంట్లు, మా విల్లాలు ప్రాంతాలు, అలాగే 11 కెవి వోల్వో ఫీడర్ ప్రభావిత ప్రాంతాలు కౌసల్య కాలనీ, రేణుక యల్లమ్మ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫర నిలిపివేయబడుతుందని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

**మైలార్‌దేవ్‌పల్లిలో**

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 14 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా 15వ తేదీ శనివారం 10 నుంచి1 గంట వరకు నందిముస్లాయిగూడ,హుడాకాలనీ,మురళీనగర్,11 నుంచి 2 గంటలు వరకు చౌక్,పురానీహవేలీ,కమేలా,2 నుంచి 5 గంటలు వరకు తేజస్వీనగర్,పాండురంగానగర్ ఫీడర్ల పరిధులలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

### ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ ప్రదర్శన


బాలల దినోత్సవం సందర్భంగా కింగ్స్ స్కూల్ లో చిన్నారుల వేషాధారణల ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 14 ( ప్రభాతవార్త ):** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన చిన్నారుల వేషాధారణల కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. కింగ్స్ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలతో మంచి మంచి వేషధారణలతో కార్యక్రమం చాలా రసవత్తరంగా జరిగింది ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుచిత్ర, అధ్యాపకులు అనురాధ, వైష్ణవి, విద్యార్థులు శ్రేష్ట, నీవ్ తల్లిదండ్రులు సాయి ప్రసన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు. పిల్లలో చిన్ననాటి నుండి దేశభక్తి పట్ల మక్కువ కలిగించాలని, ఉత్తమ విద్యార్థిగా రాణించడానికి ప్రత్యేక శ్రద్ధను తట్టితండ్రులు తీసుకోవాలన్నారు.

### విజేతలైన బాలలకు తెలంగాణ సారస్వత పరిషత్తు బహుమతులు

**నాంపల్లి, నవంబరు 14 ప్రభాతవార్త :** జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్తు శాంతా వసంతా ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన బాలల పోటీల విజేతలను ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సుమారు వందకుపైగా పాఠశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పరిషత్తు నిర్వహించిన వచన కవిత, పద్యకవిత, కథ, పుస్తక సమీక్ష, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రత్యేక బహుమతులు కూడా అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 ఆదివారం మరొక విడత అప్పటికప్పుడు విద్యార్థులకు పుస్తక సమీక్ష, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగే ఉత్సవంలో పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండే ప్రత్యేక సదస్సు కూడా నిర్వహించనున్నట్లు జె.చెన్నయ్య వెల్లడించారు.


సికింద్రాబాద్ వెస్లి పాఠశాలలో చిల్డ్రన్స్ డే సందర్భంగా 1972 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చిన్నారులతో కలిసి సంబరాలు జరుపుకున్న దృశ్యం

## గండిమైసమ్మలో కాంగ్రెస్ సంబురాలు


యువనేత కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

**దుండిగల్, నవంబర్ 14 ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా గండిమైసమ్మ చౌరస్తాలో యువనేత కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. టపాకులు కాల్చుతూ స్వీట్లు పంపిణీ చేసుకొని పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంటే ప్రజాప్రభుత్వం, ప్రజాసంక్షేమ ప్రభుత్వమని అనడానికి జూబ్లీహిల్స్‌లో ఘనవిజయమే నిదర్శనమన్నారు. ప్రజాపాలనకు పట్టకడుతూ భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థికి నవీన్ యాదవ్‌కు అపూర్వ విజయాన్ని అందించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు నవీన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాధు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, మైనార్టీ అధ్యక్షులు అక్బర్, నాయకులు ఆకుల ప్రేమ్‌కుమార్, ముత్యంరెడ్డి, రచ్చనాయక్, ఖాజ, గజేంద్ర, మల్లేష్‌యాదవ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఉప్పుగూడలో ఉచిత మెడికల్,కంటి వైద్య శిబిరం


వైద్య శిబిరం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సంస్కార్ సేవా ఫౌండేషన్ చైర్మన్ ఆకుల శ్రీరామమూర్తి

**చార్మినార్,నవంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పుగూడలోని సాయి కృప వసంత బంకుట్ హాల్‌లో ఈ నెల 16వ తేదీన సంస్కార్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్,ఐ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఆకుల శ్రీ రామమూర్తి తెలిపారు.వైద్య శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు.మధుమేహం,టుడి ఈకో,ఈసిజి. బిపి,డెంటల్,బిఎండి, జనరల్ హెల్త్,కంటి,కార్డియాలజీ,స్కిన్ కాస్మోస్టిక్ స్క్రీనింగ్ తదితర వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పరిణీ చేయనున్నామని ఆయన తెలియజేశారు.శాలిబండ రాజేష్ మెడికల్ ఉచితంగా రోగులకు మందులు అందజేయనున్నదని,ఆదివారం ఉదయం 9.30 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వర కు వైద్య శిబిరం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కార్య క్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శివ కుమార్,ప్రభాకర్ పాల్గొన్నారు.

## జూపార్కు ఆవరణలో పండిల్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి


పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**చార్మినార్,నవంబరు14 ప్రభాతవార్త :** భారత దేశ తొలి ప్రధాన మంత్రి స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమం శుక్రవారం బహదూర్‌పురలోని నెహ్రూ జూలాజికల్ పార్కు ఆవరణలో జరిగింది.పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి టిపిసిసి ఎలక్షన్ కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్‌తో పాటు పాతబస్తీకి చెందిన కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్య లాల్, సయ్యద్ ఇక్బాల్,మహ్మద్ జబ్బార్,భారీఖాన్,భాను చందర్, నసీర్,ఫారూఖ్, జ్యోతి శెట్టి,అహ్మద్,అశ్వాక్,జూ పార్కు డిప్యూటీ డైరెక్టర్ బర్నోబా,జూ పార్కు సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ తప్పుడుప్రచారాలను తిప్పికొట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు :ఎమ్మెల్యే శ్రీగణేష్


కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు మిఠాయి తినిపిస్తున్న జంపనప్రతాప్,కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు

**కంటోన్మెంట్,నవంబర్ 15 ప్రభాతవార్త:**
జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినందుకు జూబ్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినందుకు శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆనందోత్సవాల మధ్య బాణసంచాలు పెల్చి,మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కంటోన్మెంట్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, తప్పుడు ప్రచారం చేసినప్పటికి ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, బద్రినాథ్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, బల్వంత్‌రెడ్డి, నరేశ్, మహేశ్, ధనలక్ష్మి, సరిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

### యువ వయస్సులో పెరుగుతున్న ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ : డాక్టర్ పవన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు

**కంటోన్మెంట్,నవంబర్ 15 ప్రభాతవార్త:**
యువతో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని మెడికర్ ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పవన్ అద్దాల తెలిపారు. ప్యాంక్రియాటిక్ క్యాన్ సర్ అవగాహన మాసంను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజల కోసం వాక్‌థాన్ ఉచిత వైద్య శిబిరాలు, యువ వైద్యుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ నిశ్శబ్ధంగా ఉంచవచ్చుకానీ అది అత్యంత తీవ్రమైందన్నారు. అందువల్ల ఆరంభ దశలో వైద్యపరీక్షలు చేయించుకొని తమ ప్రాణాలు రక్షించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ గోపాల్ బండారి, డాక్టర్ సంతోష్,నారయణ్ కర్, డాక్టర్ అజయ్ శేషారావ్, షిండేలు పాల్గొని ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇచ్చారు.

### మెగా యూజ్డ్ కార్స్ ఎక్స్చేంజి మేళా ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, నవంబర్ 14, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హర్ష టొయోట వారు నూతనంగా ఏర్పాటు చేసిన మెగా యుజ్డ్ కార్స్ ఎక్స్చేంజి మేళను శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోల్ల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దూలపల్లి ఫంక్షన్ హాల్ వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

**కొంపల్లి, నవంబర్ 14, ప్రభాతవార్త**
కొంపల్లి మున్సిపల్ కార్యాలయం నందు జగిరిన దూలపల్లి ఫంక్షన్ హాల్ వేలం ఆర్థిక సంవత్సరం 2025-26 సంబంధించి శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించడం జరిగింది. ఈ వేలంలో మొత్తం 6 మంది పాల్గొన్నారు. పారదర్శకంగా జరిగిన ఈ వేలంలో బైరీ హర్షిత్ గౌడ్ రూ. 15,05,000 అత్యధిక వేలం పాట పాడి వేలాన్ని దకించుక్నునారు. వేలం ప్రక్రియను పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, సక్రమంగా మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో నిర్వహించబడింది.

### ఎస్‌పిఆర్ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ డా.ఎస్.ఎల్లారెడ్డి

**దుండిగల్, నవంబర్ 14 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఎస్‌పిఆర్ హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు వివిధ వేషదారణలతో హాజరై సందడి చేశారు. విద్యార్థులు తాము రూపొందించిన కళాకృతులను ప్రదర్శించగా ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎస్‌పిఆర్ గ్రూప్స్ చైర్మన్ డా.ఎస్.ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలల దినోత్సవం ఘనంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలను నిర్వహిస్తూన్నామని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ఎస్‌పిఆర్ గ్రూప్ పని చేస్తోందని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్ఐఎన్‌లో ఘనంగా ప్రారంభమైన ఎన్ఎస్ఐ 57వ వార్షిక సదస్సు

**తార్నాక, నవంబర్ 14 ప్రభాతవార్త :** ఐసిఎంఆర్ జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)లో న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్ఐ) 57వ వార్షికోత్సవ సదస్సు తార్నాకలోని ఎన్ఐఎన్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సంవత్సరం సుపోషిత్ భారత్ ఫర్ ఏ వికసిత్ భారత్ అనే థీమ్‌తో ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతీ కులకర్ణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎన్ఎస్ఐ ప్రసిడెంట్ డాక్టర్ శరత్ గోపాలన్ పాల్గొని ముఖ్య ప్రసంగం చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడానికి పోషకాహారం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన, బలమైన, మంచి పోషకాహారంతో కూడిన భారతదేశాన్ని తీర్చిదిద్దడానికి న్యూట్రిషన్ సైంటిస్టులు ముందుకు తీసుకెళ్లాలన్నారు. అందుకు న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషిని, లక్ష్యాలను తెలియజేశారు. గత 50 సంవత్సరాలుగా ఐసిడిఎస్ చేస్తున్న పనితీరుపై సైంటిస్టులు విస్తుతంగా చర్చించారు.ఈ సదస్సులో ఎన్ఐఎన్


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. భారతి కులకర్ణి ఇతర సైంటిస్టులు

మాజీ డైరెక్టర్ డా. ఆర్. హేమలత, ఎన్ఎస్ఐ వైస్ ప్రసిడెంట్ డా. రాజుసింగ్ చిన్నా, ఎన్ఎస్ఐ సెక్రటరీ డా. సుబ్బారావు ఎం. గవరవరపు,ఎన్ఎస్ఐ వైస్ ప్రసిడెంట్ డా. భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ వార్షిక సదస్సులో దేశ వ్యాప్తంగా దాదాపు 1300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఇందులో 460కి పైగా ప్రసంగాలు, పోస్టర్ ప్రజెంటేషన్లు చేశారు.

## బోగస్ ఓట్లు తొలగించకుండా ఏ విధంగా ఎన్నికలు నిర్వహిస్తారు

**చిక్కడపల్లి నవంబర్ 14 (ప్రభాతవార్త ):** వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఎన్నికలను ఓటమి భయంతోనే కమిటీ సభ్యులు నియమ నిబంధనలు పాటించకుండా ముందస్తుగా ఎన్నికలకు వెళ్తున్నారని పలువురు మాజీ అధ్యక్షులు అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో క్లబ్ మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గౌడ్,మన్నె దామోదర్ రెడ్డి, కందూరి కృష్ణ, కృపానంద్, మాజీ అడ్వైజర్లు వెంకటకృష్ణ (బబ్లు),కాసాని ఆనంద్,క్లబ్ మాజీ కార్యదర్శి బి.వెంకటస్వామి గౌడ్, క్లబ్ మాజీ సభ్యుడు, వాకర్ కిషన్ రావు లు మాట్లాడారు.నిబంధనలు పాటించకుండా ఎన్నికలకు వెళ్లడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ ఓట్లతో తో ఏ విధంగా ఎన్నికలకు వెళతారని వారు ప్రశ్నించారు. వాకర్స్ కానీ వారిని, ఏ రోజు కూడా సుందరయ్య పార్కు రాని వారిని సభ్యులుగా చేర్చుకొని, ఓటర్ లిస్టు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. 2022 క్లబ్ అధ్యక్షునిగా రమేష్ రెడ్డి కొనసాగిన అప్పటినుంచి బోగస్ ఓట్ల పరంపర ప్రారంభం అయిందని, 2023..24 సంవత్సరంలో ఓటర్ లిస్టు తప్పుల తడుకగా ఉండడంతోనే కమిటీ సభ్యులందరూ కలిసి రూపుల వివేక్ ను, అదేవిధంగా,2024..25 అధ్యక్షునిగా నిరంజన్ రెడ్డిని ఏకగ్రీవంగా అధ్యక్షులుగా నియమించడం జరిగిందన్నారు. బోగస్ ఓట్లను తొలగించి మీ విశ్వసనీయను చాటుకోవాలి అన్నారు. ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న నిరంజన్ రెడ్డి హయంలో కూడా పెద్ద ఎత్తున వాకర్స్ కానీ వారి కి సభ్యత్వం ఇచ్చారని మండిపడ్డారు..ఆగమాగముగా నోటిఫికేషన్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకు ఏర్పడ్డదో సభ్యులందరికీ తెలుపాలన్నారు.జనరల్ బాడీ సమావేశం పెట్టకుండా నియంతృత్వంగా ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. సుందరయ్య పార్కులో జరిగిన అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో, ఎవరి ద్వారా జరిగిందో వాకర్స్ అందరికీ తెలుసు అన్నారు. ఇప్పుడున్న కమిటీ చేసిన అభివృద్ధి చేసింది ఏమిటని ప్రశ్నించారు. తప్పుల తడకగా ఉన్న ఓటర్ లిస్టును పరిశీలించి ఎన్నికలను వాయిదా వేయాలని ఎన్నికల అధికారి డాక్టర్ కే. రామానందము కోరడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో వాకర్స్ రాయపటి రవి, ఆర్ జయదేవ్,రాజ్ కుమార్, దేవరాజ్ పాల్గొన్నారు.

### బోయిన్‌పల్లిలో ఘనంగా బాలల దినోత్సవం


1వ వార్డు బాపూజీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్,నవంబర్ 15 ప్రభాతవార్త:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన చిల్డ్రన్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొన్న పిల్లలకు బహుమతులు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆశీర్వాదం, టీచర్లు పద్మావతి, సరిత, శోభారాణి, ఆర్తీ,అనిత, హరినాథ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు స్వెటర్స్‌పంపిణీ



రైల్ నిలయం అంబేద్కర్ నగర్ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు స్వెటర్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**అడ్డగుట్ట,నవంబర్ 15 ప్రభాతవార్త:** బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్ అంగన్ వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు స్మయిల్ గిఫ్ట్ షైన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పిల్లలకు షెటర్స్,టిఫిన్ బాక్స్‌లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు గంగారపు సత్యపాల్, లాజరస్, గ్రేస్ మణి, మేరీ, అంగన్ వాడి టీచర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బీహార్‌లో ప్రజల విజయం


బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి సంబురాలు మిఠాయిలు తినిపిస్తున్న దృశ్యం

**బేగంబజార్,నవంబర్ 14 ప్రభాతవార్త:**
బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఎన్నికల ఫలితాల్లో బిజెపి మిత్రపక్షం ఊహించని రీతిలో స్థానాల్లో విజయం సాధించడం పట్ల తెలంగాణబిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి జాతీయ,రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న సంబురాలు చేసుకున్నారు. బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, మిత్రపక్షమైన (ఎన్.డి.ఏ)సుమారుగా200పైగా అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు,తమిళనాడు బిజెపి ఇన్‌చార్జ్ పి.సుధాకర్‌రెడ్డి,జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్‌లతోపాటు పలువురు సంబురాలు చేసుకున్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి,బిహార్ రాష్ట్రముఖ్యమంత్రి కొనసాగిన నితీశ్‌కుమార్ చేపట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయడం పట్లనిజాయితీతో బిహార్ ప్రజలు ఓటు వేసి మరోసారి ఎన్.డి.ఏ కూటమికి పట్టం కట్టినట్లు చెప్పారు.

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సొంత నిధుల నుంచి 10వ తరగతి పరీక్ష ఫీజు : గాజుల సౌందర్య

**అడ్డగుట్ట,నవంబర్ 15 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులందరికి తెలంగాణ ఎస్.ఎస్.సీ బోర్డు పరీక్ష ఫీజును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సొంత నిధుల నుంచి డబ్బులు వెచ్చించడం అభినందనీయమని అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల 10వ తరగతి పరీక్ష ఫీజు తన నెలసరి జీతం అందజేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరికి ఆదేశాలు జారీ చేశారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల అడ్డగుట్ట ప్రజలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు.

### ట్రావెల్స్‌ఏజెన్సీతో సమావేశమైన డిసిపి రష్మిపెరుమాల్



ట్రావెల్స్ ఏజెన్సీ ఆపరేటర్లతో సమావేశమైన డిసిపి సాధన రష్మిపెరుమాల్

**కంటోన్మెంట్,నవంబర్ 14 ప్రభాతవార్త:**
ఢిల్లీ ఘటన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉంచేందుకు శుక్రవారం ఉత్తర మండలం డిసిపి సాధన రష్మి సికింద్రాబాద్‌లోని ట్రావెల్ ఏజెన్సీ ఆపరేటర్లతో సమావేశమైయ్యారు. ప్రయాణ సమయాల్లో ట్రావెల్స్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండేందుకు ట్రావెల్స్ ఏజెన్సీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు సుబ్బయ్య, గోపాలక్రిష్ణ,రమేశ్, ఇన్‌స్పెక్టర్లు సోములు వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, అనురాధ, మధు బాబు తదితరులు పాల్గొన్నారు.

### పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి



టీ. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలు

**జీడిమెట్ల, నవంబర్ 14, ప్రభాతవార్త**
భారత స్వాతంతరం అనంతరం తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 136వ పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.ఎల్.ఆర్.ఐ.టి చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి విచ్చేసి బాల్ త్రో ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూకి ఎంతో ఇష్టమైన చిన్నారులతో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, చక్కటి నృత్యాలు వేసి చూపర్లను ఆకట్టుకున్నారు. నేటి నుండి మూడు రోజులపాటు అనగా14,15,16 తేదీలలో అందరి పాఠశాలల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ బీపీఎస్ ఒలంపియాడ్ చింతల్, బీపీఎస్ ప్లే స్కూల్ సూరారం, టివిఆర్ హైస్కూల్ చింతల్, టివిఆర్ గీతాంజలి చింతల్ పద్మారావు నగర్, బీపీఎస్ రంగారెడ్డి నగర్, సత్యవాణి విద్యా నికేతన్ ఎస్ ఆర్ నాయక్ నగర్, టివిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ మొత్తం 7 స్కూల్స్ పోటీ పడనున్నాయి. త్రో బాల్, రన్నింగ్ రేస్, రిలేరన్, చెస్, చైనీస్ చేక్కర్, క్రికెట్, కోనపన్ డౌన్, బాల్ డ్రాయింగ్ విత్ హోప్, వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి ఆటలను నిర్వహించనున్నారు. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్, కరస్పాండెంట్ అరుణకుమారి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీ పూర్ణిమ చిన్నారులకు 136వ జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు పార్టీ పరంగా కాకుండా చట్టపరంగా ఇవ్వాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**ముషీరాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా కాకుండా చట్టపరంగా ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రేపటి క్యాబినేట్‌లో బీసీ రిజర్వేషన్లను పార్టీ పరంగా చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం ఉందని, ఇటువంటి ఆలోచనలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని సూచించారు. కేసు కోర్టులో ఉండగా, ఒక నెలలో తీర్పు వస్తున్న తరుణంలో ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికారు. అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ఉన్నారని, మొన్నటి రాష్ట్ర బంద్‌కూడా చారిత్రాత్మకమని, కేసు కూడా బలంగా ఉంది కాబట్టి, కోర్టు తీర్పు తప్పకుండా బీసీలకు అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారని, జనాభా లెక్కలు తీసి, న్యాయబద్ధం చేశారని గుర్తు చేశారు. గతంలో సుప్రీం కోర్టు కూడా జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చునని తీర్పు ఇచ్చారని, దాని ప్రకారం కూడా రిజర్వేషన్ల పెంపుదలకు పూర్తి మద్దతు ఉన్నట్లు అర్థం అవుతోందన్నారు. సుప్రీంకోర్టు అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50శాతం సీలింగ్ ఎత్తివేసిందని, అదే విధంగగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డేటా ఉంటే 50శాతం సీలింగ్‌ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు తీర్పుకూడా ఉందని గుర్తుచేశారు. చట్ట ప్రకారం, న్యాయ ప్రకారం రాజ్యాంగ పరమైన అవరోధాలు కూడా లేవు కాబట్టి ఏకోణంలో చూసినా కేసు గెలిచే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కాబట్టి పార్టీ పరంగా రిజర్వేషన్లు వద్దే వద్దని, చట్టపరంగానే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.16వ తేదీ న్యాయసాధన దీక్షలు: ఈనెల 16న బీసీ రిజర్వేషన్ల సాధనకై ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు జరపాలని నిర్ణయించామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద మరియు అన్ని జిల్లాలో, నియోజకవర్గాల కేంద్రాలలో కూడా న్యాయసాధన దీక్షలు జరపాలని పిలుపునిచ్చారు.

## నవీన్ యాదవ్ గెలుపు.. బిసిల గెలుపు : దాసు సురేష్

**హైదరాబాద్, నవంబర్ 14,ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీసీ ఓటు బ్యాంక్ పోలరైజ్ అవ్వడం వల్ల నవీన్ యాదవ్ గెలుపు సుమాయసంగా సాధ్యమైందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ పేర్కొన్నారు.. శుక్రవారం జూబ్లీ హిల్స్ ఎన్నిక ఫలితం వెలువడిన తర్వాత నవీన్ యాదవ్ గెలుపుకోసం 15 రోజుల పాటు నియోజక వర్గంలో కృషిచేసిన ప్రధాన బీసీ నాయకులతో కలిసి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు మీడియా ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పరచారు..తదనంతరం దాసు సురేశ్ మాట్లాడుతూ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక అట్టడుగు వర్గాల ఆత్మగౌరవానికి , అహంకార పూరిత పార్టీలకు మధ్య జరిగిన యుద్ధంగా అభివర్ణించారు.జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో బీసీ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల భారీ మెజారిటీ తో గెలవడానికి బీసీల ఓటు పోలరైజ్ అవ్వడం, కాంగ్రెస్ నాయకత్వం పటిష్టమైన ప్రణాళికతో కలిసికట్టుగా పనిచేయడం ఎంతగానో కలిసి వచ్చిందని దాసు సురేశ్ తెలియజేసారు.. ఇకపై రాష్ట్రంలో బీసీల రాజకీయ జైత్రయాత్ర కొనసాగా ఉందని దాసు సురేష్ తెలిపారు.. బీసీలకు టికెట్ ఇస్తే గెలవరనే అగ్రవర్ణాల అపవాదును నవీన్ యాదవ్ పటాపంచలు చేశారని పేర్కొన్నారు..బీసీ బిడ్డను ఎన్నికల ప్రచారంలో అగ్రవర్ణ పార్టీలు క్రూరంగా క్రూరంగా నిందించడం, ఫేక్ ప్రచారాలు గావించడం, అనేకరకాలుగా విషం గక్కినా ప్రజలు మాత్రం నిజాయితీకే పట్టం గట్టారని పేర్కొన్నారు.. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చిన బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు బీసీల రాష్ట్ర బంద్ కు సైతం కలిసి వచ్చినా ఉప ఎన్నిక సమయానికి మాత్రం బీసీ అభ్యర్థికి బీఫామ్ ఇవ్వకపోవడాన్ని జూబ్లీహిల్స్ బీసీ ప్రజలు తీవ్రంగా పరిగణించారని దాసు సురేష్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ ఫార్మర్స్ రైట్స్ ప్రొటెక్షన్ చైర్మన్ అండ్ మిషన్ ఫర్ ద పూర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్దేపల్లి రామకృష్ణ, ఈబీసి నాయ కులు, టి పి సి సి సెక్రెటరీ గంటా సత్యనారాయణ రెడ్డి, ఐ ఎన్ టి యు సి హన్మకొండ జిల్లా ఇంచార్జ్ కూర వెంకటేశ్వర్లు, ఆల్ బిసి మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ శుక్రుద్దీన్, బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ రవి యాదవ్ ,హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి తాళ్ల భాగ్యలక్ష్మి, నాయకు రాళ్లు పులిపాపుల జ్యోతి, శారదమ్మ,మహాలక్ష్మి,శ్రీలత ,నాగ రాజు మల్లికార్జున్ శ్రీధర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు

### పేద విద్యార్థుల వసతి గృహాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

**ముషీరాబాద్, నవంబర్ 14, ప్రభాతవార్త:**


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

పేద విద్యార్థుల వసతి గృహాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. నిన్న సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్‌ఖాన్ పేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహంలో వార్డెన్ మద్యం మత్తులో అన్నం పాత్రలో కాలు పెట్టి నిద్రించటం, పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇటువంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేద, బడుగు బలహీన వర్గాలకు విద్యా బుద్ధులు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన విద్యాలయాలు నేడు కాంగ్రెస్ పాలనలో దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికలలో గెలిచామని ఆనందించటమే కాకుండా గురుకుల పాఠశాలల్లో, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో భోజన వసతిని పరిశీలించి, పర్యవేక్షించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికలలో గెలిచారంటే ప్రజలు మీవైపే ఉన్నారని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాబ్‌లో పోగొట్టుకున్న నగదు,బంగారు అభరణాలు,ల్యాప్‌టాప్‌లు అందజేత

**కంటోన్మెంట్,నవంబర్ 14 ప్రభాతవార్త:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బొల్లారం క్యాబ్‌లో వెళ్తు 30 లక్షల విలువ చేసే బంగారు అభరణలు, ల్యాప్‌టాప్ పోగొట్టుకున్న వ్యక్తికి రెండు గంటల్లోనే బాధితుడికి అప్పగించిన సంఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం ప్రాంతానికి చెందిన ఫణి అనే వ్యక్తి గురువారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బొల్లారంకు క్యాబ్‌లో వస్తుండగా తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లో రూ.25 లక్షల విలువ చేసే 25 తులాల బంగారు అభరణాలు, ల్యాప్ టాప్ పోయింది.వెంటనే బాధితుడు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి సీసీపుటేజీల ఆధారాలతో క్యాబ్‌ను గుర్తించి నల్ల కుంటకు చెందిన జబ్బార్ కారుగా గుర్తించి అతనికి ఫోన్ చేశారు. పోగొట్టుకున్న బంగారు అభరణాలు,ల్యాప్‌టాప్‌ను 2 గంటల వ్యవధిలోనే బాధితుడికి తిగిరి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

## బాలల దినోత్సవం




**అఫ్జల్‌గంజ్,నవంబర్ 14ప్రభాతవార్త:** నేటి బాలలే రేపటి పౌరులని,భవిష్యత్తుల్లో ఉన్నత విద్యనుఅభ్యసించి తల్లిదండ్రులను, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కార్పొరేటర్లు శశికళ కృష్ణ,లాల్‌సింగ్‌లు పేర్కొన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రహీంపురాలోని అంబేద్కర్ ప్లేగ్రౌండ్‌లో రిలయన్స్ హైటెక్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుమతుల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్పోర్ట్స్, ఇంటర్‌హౌజ్ పోటిలల్లో గెలుపు పొందిన విద్యార్థీనీ,విద్యార్దులకు బహుమతులను అందచేశారు.విద్యార్దుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో రిలయన్స్ హైటెక్స్ డైరెక్టర్ ఠాకూర్ జితేందర్‌సింగ్,మాజీ కార్పొరేటర్లు అనిల్‌సింగ్,పరమేశ్వరిసింగ్,ప్రిన్సిపల్ నిషాసింగ్,వైస్‌ప్రిన్సిపల్ మమతసింగ్, విద్యార్దులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపుతో ఘనంగా సంబరాలు


సంబారాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

**నిజాంపేట్, నవంబర్ 14, ప్రభాతవార్త**
జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఘనంగా టపాసులు కాల్చుతూ మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## కెటిఆర్ అహంకారాన్ని ఓడించిన జూబ్లిహిల్స్ ప్రజలు

### ఖైరతాబాద్ డిసిసి ప్రెసిడెంట్ రోహిన్ రెడ్డి

**హైదరబాద్,నవంబరు 14,ప్రభాతవార్త:**
కెటిఆర్ అహంకారంను జూబ్లీహిల్స్ ప్రజలు ఓడించారని ఖైరతాబాద్ డిసిసి ప్రసిడెంట్ రోహిన్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్ ఆయన మట్లాడుతూ జూబ్లీహిల్స్ అసెంబ్లీలో కాంగ్రెస్ గెలిపు ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలన కు నిదర్శనమని అన్నారు.బిఆర్ ఎస్, కెటిఆర్ చేస్తున్న అహంకారపు రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు..రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా అన్ని వర్గాల సంక్షేమానికి, అన్ని ప్రాంతాల అభివృద్ధి చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని అభివర్ణించారు.కెటిఆర్ తన మాటలతో రాజకీయాలను కలుషితం చేశారని దుయ్యబట్టారు. అందుకే ప్రజలు బిఆర్ ఎస్ కు తగిన బుద్ధి చెప్పారు.హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వరదలు వచ్చినపుడు తీసుకున్న చర్యలు, బతుకమ్మ కుంట అభివృద్ధి తదితర కార్యక్రమలు కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి దోహదం చేసాయి..

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DIST, AT : RAJENDRA NAGAR
O.S. No. 125 of 2024
Between:
Vuppala Swaroopa and 3 others ...Plaintiffs
And
KK MINTRI ...Defendant
NOTICE
To,
KK MINTRI S/o NN MINTRI
Age 72 Years, Occupation Business, R/o 14, BHEL Enclave, Akbar Road, Secunderabad, Hyderabad.
The above named plaintiffs have filed the above suit against you for specific performance of agreement of sale cum general power of attorney. You are here by summoned to appear before the above said court in person or by an advocate duly instructed on 21.11.2025 at 10:30 am failing which the matter will be decided ex-parte in accordance with law.
SCHEDULE OF PROPERTY
All that open plot bearing No 1401 admeasuring 240 Sq.yards or 200.7 Sq.Mtrs in survey No. 4/1,5/1,6,7,8,9 & 13 situated at Grandville, Sector-2, Gandiguda village, Ghansimiyaguda Gram panchayat Shamshabad Mandal, RR Dist as bounded NORTH: Plot No.1402, SOUTH: Plot No.1400, EAST: 30'f wide Road, WEST: Plot No.1412.
#BY ORDER OF THE COURT#
RAVI KONDOORI
Advocate
FLAT No 512, Sri Harsha Sethuram unique Apartment, Vijayapuri, Tarnaka, Secunderabad-17.
9848577071

PUBLIC NOTICE
The general public is hereby informed that my client Kamlapally Narsimha Reddy while proceeding towards Kismathpur Village, on verification of Documents my client came to know that he lost his Original Regd. Rectification Deed bearing Doc.No. 1290/2010 Dt: 22/05/2010 with regarding Agriculture land in Sy.No. 37/A/2, admeasuring Ac. 0-07 Gts. situated at Kismathpur Village, Rajendra nagar (Now Gandipet) Mandal, R.R. District. The general public here by requested that if the above said Original Regd. Rectification Deed bearing Doc. No. 1290/2010 Dt: 22/05/2010 traced out to anybody kindly handedover the same to the under-signed within one week from the date of this public Notice.
PATLOLLA SUDHARSHAN REDDY
ADVOCATE
Off. : Flat No. 301, Devi Mid-Town, 3rd Floor, Hydershakote, Sun-City, Hyderabad-500091.
Email: psreddy.patlolla3@gmail.com
Cell : 8125712577, 9490751824

## రేపు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



కార్తీక వనభోజనాలకు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు.

**వనస్థలిపురం. నవంబర్.14.ప్రభాతవార్త.**
వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనస్థలిపురం సచివాలయనగర్ లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం లో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం వనస్థలిపురం అధ్యక్షుడు తడకమల్ల విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు .ఆర్యవైశ్య బంధువులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో నంబూరి శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్, సాయి మోహన్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దివంగత మాజీ ప్రధాని నెహ్రూ సేవలు ఎనలేనివి : టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పిస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, గ్రేటర్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, నవంబర్ 14, ప్రభాతవార్త:**
దివంగత మాజీ ప్రధాని నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ ఓబిసి సెల్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభ్యున్నతి కోసం నెహ్రూ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ గౌస్, మదన్ బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలి : జడ్ఇఓ అంకమ్మరావు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపల్ స్వర్ణకుమారి తదితరులు

**మలక్ పేట, నవంబర్ 14, ప్రభాతవార్త:**
విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో విద్యాభ్యాసం చేసి తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని భాష్యం విద్యాసంస్థల జెడ్ఇఓ అంకమ్మరావు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాష్యం విద్యాసంస్థల జెడ్ఇఓ అంకమ్మరావు ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణకుమారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలోనీ మూడు దశల్లో బాల్యం అతి ముఖ్యమైనదని, మధురమైనదని పేర్కొన్నారు. బాల్య దశలో విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువు, మంచి వారితో స్నేహం అతి ముఖ్యమైనవని వివరించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో, ఆధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నమని పేర్కొన్నారు. వివిధ అంశాలలో గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికే ప్రజలు జై కొట్టారు - సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం చేకూర్చడం ద్వారా ప్రజలు మరోసారి తమ మద్దతును తెలిపారని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. గత నెల రోజులుగా సేవాదళ్ కార్యకర్తలతో కలిసి జూబ్లీహిల్స్ లోని ఏడు డివిజన్లలో ప్రతి ఇంటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరడం జరిగిందన్నారు. జూబ్లీహిల్స్ లోని ఏడు డివిజన్లకు ప్రత్యేక కమిటీలు వేసి ప్రచారంలో పాల్గొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## విష్ణునగర్ లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్ రెడ్డి

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ విష్ణునగర్ లో రూ.11.5లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, కాలనీవాసులు కృష్ణ యాదవ్, బిక్షపతి యాదవ్, దశరథ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపుతో కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలు



జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీ గెలుపొందిన సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మల్కాజ్గిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ గెలుపొందడంతో కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న నాయకులు, కార్యకర్తలు



చంపాపేట చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



చైతన్యపురిలో సంబరాలు నిర్వహిస్తున్న డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ శశిధర్ రెడ్డి , కాంగ్రెస్ నేతలు,తదితరులు



రామంతాపూర్ లో విజయోత్సవ సంబరాలు చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడ అకారపు అరుణ్ పటేల్ తదితరులు



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో విజయంతో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ లో మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు చేస్తున్న పారిజాత నర్సింహారెడ్డి



కాంగ్రెస్ విజయంతో డిప్యూటీ మేయర్ నివాసంలో సంబురాలు జరుపుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

## చదువు పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

**ఎల్.బి.నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడంతో పాటు భావి భారత పౌరులుగా ఎదగాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, సీఈఓ చైతన్య, జెడ్ఈవో అంకమ్మరావు పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ లోని పద్మావతి కళ్యాణ మండపంలో బాలల దినోత్సవ వేడుకలను భాష్యం స్కూలు విద్యార్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని నెహ్రూకు పిల్లలు, పూలు అంటే ఎంతో ఇష్టమని అందుకోసమే బాలల దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. నెహ్రూ లాంటి గొప్ప వ్యక్తుల జీవితాలను నేటి విద్యార్థులు ఆదర్శవంతంగా తీసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి భారత బావి పౌరులని అన్నారు. నేటి పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారి ఎదుగులపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకుంటూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ప్రేమతో ఉండాలని, విద్య, సంస్కారం, నైతిక విలువలను పెంపొందించుకోని భవిష్యత్తును మంచిగా మలుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించి ఆహుతులను అలరింపజేశారు. పాఠశాలలో నిర్వహించిన ఎస్సే రైటింగ్, ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు వారు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినిలు

## ఎన్పిఎల్ జోనల్ లెవల్ ఛాంపియన్షిప్ విజేత మీర్పేట్ నారాయణ స్కూల్

**సరూర్ నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక ఎన్పిఎల్ స్పోర్ట్స్ మీట్ లో జోనల్ లెవల్ ఛాంపియన్షిప్ ను మీర్ పేట్ బ్రాంచి నారాయణ పాఠశాల దక్కించుకుంది. నారాయణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గత బుధవారం వనస్థలిపురం జోన్ నారాయణ జోన్ ఎన్పిఎల్ (నారాయణ ప్రీమియర్ లీగ్) క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో జోన్ పరిధిలోని నారాయణ బ్రాంచుల విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. అయితే ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి సత్తా చాటిన మీర్ పేట్ బ్రాంచ్ నారాయణ పాఠశాల విద్యార్థులు వనస్థలిపురం జోనల్ లెవల్ ఛాంపియన్ షిప్ ను కైవసం చేసుకున్నారు. అయితే శుక్రవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కిరణ్ రెడ్డితో పాటు నారాయణ జిఎం గోపాల్ రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబుల చేతుల మీదుగా మీర్ పేట్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ బాబ్జి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. అదే విధంగా క్రీడల్లో విజేతలకు నిలిచిన వివిధ బ్రాంచ్ ల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా ముగింపు ఉత్సవంలో కిరణ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమనీ అందరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. కఠోర సాధన చేస్తే తప్ప విజయాలు దక్కవని ఆయన అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో ప్రయత్నిస్తే అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ బ్రాంచ్ ల ప్రధానోపాధ్యాయులు నౌషిమా ఫాతిమా, రవికుమార్, మాధవి, భువనేశ్వరి, నాగరాణి, లావణ్య, మానసలతో పాటు సిఓలు, ఎడిలు, ఎఓలు, విపిలలతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినర్ జోజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కిరణ్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మీర్ పేట్ నారాయణ ప్రిన్సిపాల్ బాబ్జి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

## రూ.కోటి 50లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, నవంబరు 14 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ లో రూ.కోటిన్నర వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్ లోని అజ్మత్ నగర్ కాలనీలో రూ.కోటి వ్యయంతో కల్వర్టు పనులతో పాటు, హనుమాన్ టెంపుల్, శివాలయం, అవుట్ పోస్టు దారిలో సివరేజీ పైప్ లైన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దశలవారిగా డివిజన్ లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్ లో పెండింగ్ లో ఉన్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన పనులు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.కార్యక్రమంలో పలువురు బిఆర్ ఎస్ పార్టీ నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చిలుకానగర్ లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి : ఆర్.కృష్ణయ్య

**ఉప్పల్, నవంబరు 14 ప్రభాతవార్త :** స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాలని శుక్రవారం రామంతాపూర్ లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చట్టబద్ధంగానే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లకు కల్పించే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడానికి రాజ్యాంగ సవరణ జరగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బంద్ కు రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయని, రాజ్యాంగ సవరణకు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగంలోని చట్టం ప్రకారం స్థానిక సంస్థలోని బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చిందని, అసెంబ్లీలో చట్టం చేశారని, జివో తీసి వెంటనే ఎన్నికలు జరుపవచ్చని తెలిపారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన, చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవని, రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారని, అసెంబ్లీలో చట్టం చేశారన్నారని తెలిపారు. స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాలలో, నియోజకవర్గ కేంద్రాలలో బిసి సంఘాలు, కుల సంఘాలు ప్రజాసంఘాలతో సమావేశం జరిపి కార్యాచరణ రూపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నేతలు పల్లగోర్ల మోడీరాందేవ్ యాదవ్, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, పగిళ్ళ సతీష్, నిమ్మల వీరన్న, శివ కుమార్ యాదవ్, అంజి గౌడ్, నరేష్ గౌడ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలని ఆందోళన నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

## సిఎం సహాయనిధి పేదలపాలిట వరం : ఎమ్మెల్యే

**వనస్థలిపురం. నవంబర్.14.ప్రభాతవార్త :** సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అన్నారు. బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ నందు నివాసం ఉండే చెరుకు శ్రీనివాసులు కడుపునొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో మంజూరైన 1,15,000 రూపాయల ఎల్.ఓ.సీ. చెక్కును వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి గారు మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్,సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : డైరెక్టర్ మస్రత్ సుల్తానా



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి సంబరాలు నిర్వహిస్తున్న డైరెక్టర్ మస్రత్ సుల్తానా తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 14, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె గాంధీభవన్ లో సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించారని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోపాల్ ముదిరాజ్ కు సన్మానం



గోపాల్ ముదిరాజ్ ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు

**సైదాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త:**
చంపాపేట డివిజన్ లోని మాధవనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించిన గోపాల్ ముదిరాజ్ ను చంపాపేట డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, సరిత, యాదమ్మ, అలివేలు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు



స్కూల్లో సంబురాలు జరుపుకుంటున్న చిన్నారులు

**నాచారం, నవంబర్ 14 ప్రభాతవార్త :** నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్లు నవీన్ కుమార్, డా.కమల మనోహర్ రావు, ప్రిన్సిపల్ స్వర్ణ అక్కినేనితో పాటు పలువురు పండింట్ జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. దేశ తొలి ప్రధాని పండింత్ నెహ్రు జయంతిని పురస్కరించుకొని జరుపుకునే జాతీయ బాలల దినోత్సవాన్ని తమ స్కూల్లో ప్రతి సంవత్సరం పిల్లలతో ఘనంగా పండుగ వాతావరణంలో జరుపుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిద సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. దీంతో పాటు గేమ్ స్టాల్స్,ఫుడ్ స్టాల్స్ వంటివి ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మార్ మాల్ కు విద్యార్థులను విహార యాత్రతకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో దోబీఘాట్ నిర్మాణానికి భూసమీకరణ పరిశీలన



**నేరెడ్ మెట్ నవంబర్ 14,ప్రభాతవార్త.**
మల్కాజ్గిరి మండలంలో దోబీఘాట్ నిర్మాణానికి సంబంధించి ఎలినేషన్ ప్రతిపాదనల భాగంగా సర్వే నెంబర్లు 222, 223 ల్లోని 10 గుంటల భూమిని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్యాంప్రకాష్, తహసీల్దారు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో ఘనంగా బాలల దినోత్సవం



ఉప్పల్ లో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి సంబరాలు చేసుకుంటున్న ఎస్ఐ చిరంజీవి తదితరులు

**ఉప్పల్, నవంబరు 14 ప్రభాతవార్త :** ఉప్పల్ బబుల్స్ ప్రైమరీ స్కూల్ లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎస్ఐ చిరంజీవి ముఖ్య అతిథిగా హజరై పిల్లలకు కేక్ తినిపించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలు ఆనందోత్సవాలతో ఉండేందుకు తల్లిదండ్రులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నతనం మరువలేనిదని, మరుపురానితనం జీవితంలో ఒక్కసారి వచ్చే ఈ ఆనందాన్ని ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చందన, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ మహిళల కబడ్డీ వరల్డ్ కప్ అంపైర్స్ గా అనిల్ కుమార్, శ్రీను నాయక్



వి.శ్రీను నాయక్ ను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

**వనస్థలిపురం. నవంబర్.14.ప్రభాతవార్త.**
ఈ నెల 17 నుండి 24 వరకు బంగ్లాదేశ్ లోని డాకా జరగనున్న రెండవ కబడ్డీ మహిళ ల ప్రపంచ కప్ పోటీలకు తెలంగాణా కు చెందిన ఇద్దరు న్యాయ నిర్ణేతలుగా ఎన్నికకావడం జరిగింది.ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీషల్ బి.అనిల్ కుమార్,ఇంటర్నేషనల్ ప్రో కబడ్డీ టెక్నికల్ ఆఫీషల్ వి.శ్రీను నాయక్ లు ఎన్నికయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు ఓ ప్రకటన లో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే కబడ్డీ వరల్డ్ కప్ కు భారతదేశం నుండి తెలంగాణా ఆఫీషల్స్ ఎన్నికకావడం తెలంగాణా కె గర్వకారణమన్నారు.తెలంగాణా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్,కార్యదర్శి మహేందర్ రెడ్డి,కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్,క్రీడాకారులు అభినందించారు.

## లార్డ్స్ లో స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతుల పంపిణీ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న లార్డ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి

**సరూర్ నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:**
బడంగ్ పేట్ లోని లార్డ్స్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లార్డ్స్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి పండిత్ జవహర్ లాల్ నెహ్రూకు నివాళులర్పించారు. అనంతరం ఆయన స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జరిగిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, లార్డ్స్ ఒలంపియాడ్ ప్రిన్సిపాల్ భానూరు శ్రీనివాస్ రెడ్డి, ఇంఛార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నేటి విద్యార్థులతోనే రేపటి దేశ అభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 14 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు చిన్నపిల్లలను ఎంతో ప్రేమించే వారని ఆయన జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయుల సునీత, అరుణ జ్యోతి, సంధ్య, అంజన దేవి, శైలజ, న్యాయ సేవాదికార సంస్థ పార లీగల్ వాలంటీర్ శ్రీనివాస్ కుమార్, సత్య నారాయణ రెడ్డి, రజినీ దేవి, అరుణ, సత్యనారాయణ, బిజెపి నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, కొత్త తిరుమల్, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.